క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

వేంపల్లె : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర అంశాలపై చర్చించనున్నారని.. ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు నివేదికలతో తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు


మందును పిచికారి చేయిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య

వేంపల్లె : ప్రస్తుత సీజన్‌లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. మండల పరిధిలోని తాళ్లపల్లె పీహెచ్‌సీ పరిధిలోని టి.వెలమవారిపల్లె, ముసల్‌రెడ్డిపల్లె గ్రామాలలో గురువారం దోమల నివారణకు పైరిత్రం పిచికారి, ఫీవర్ సర్వే, లార్వా సర్వేలు నిర్వహించి మాట్లాడారు. తమ పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దోమ తెరలు వాడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త జ్యోతి, ఫయాజ్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ట


నూతనంగా ప్రతిష్ఠించిన సాయిబాబా విగ్రహం

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని పాలగిరి క్రాస్ రోడ్డు వద్ద వెలసిన కాశిరెడ్డినాయన ఆలయ ప్రాంగణంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న సాయిబాబా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం వైభవంగా ముగిసింది. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సర్వదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. మూడు రోజులు ఏర్పాటు చేసిన భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు వీరశివారెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్లూరు వీరశివారెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మాజీ ఎంపీపీ గోవిందురెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


డాక్టర్ శరణ్యారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పులివెందుల టౌన్ : ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాలలో రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలని పీహెచ్‌సీ డాక్టర్ శరణ్యారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.భేగ్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి


సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీపీపీ జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల :ఆర్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు వారి సమస్యలను పరిష్కరించాలని గురువారం ఆర్టీపీపీకి వచ్చిన బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్‌కు ఆర్టీపీపీ రీజనల్ జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు రాంభూపాల్‌రెడ్డి, ఆర్టీపీపీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చు.. అధిక దిగుబడులు


బలపనూరులో రైతు పెంచుతున్న పట్టు పురుగులు


పట్టుపురుగులను వేరు చేస్తున్న రైతులు

మల్బరీ సాగుపై రైతుల ఆసక్తి

పులివెందుల రూరల్/సింహాద్రిపురం : పట్టులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామానికి చెందిన రైతు రాంగోపాల్‌రెడ్డి నిరూపించారు. తనకున్న మూడు ఎకరాల పొలంలో మల్బరీ సాగు చేశారు. ఒకటిన్నర ఎకరా పొలంలో 250 గుట్లు తెచ్చి మేపుతున్నాడు. మదనపల్లె, కదిరి, కడప, వనిపెంట ప్రాంతాల నుంచి పురుగులు తెచ్చి వాటిని మేపుతూ మార్కెట్‌కు విక్రయిస్తున్నారు. దీంతో అధిక లాభాలు ఉండటంతో సన్న, చిన్నకారు రైతులు మల్బరీ సాగుపై మొగ్గు చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 775 ఎకరాలలో మల్బరీ సాగులో ఉన్నట్లు సిరికల్చర్ అధికారులు చెబుతున్నారు. పట్టు సాగు చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా సబ్సిడీ ఇస్తుండటంతో రైతులు మల్బరీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు యూనిట్ ఏర్పాటుకు 90 శాతం, సబ్సిడీ, ఓసీ, బీసీ, ఇతరులకు 70 శాతం సబ్సిడీ లభిస్తోంది. పట్టు సాగు చేసే రైతులకు ఆదాయం ఉంటుందని పట్టుపరిశ్రమ శాఖ అధికారులు అంటున్నారు. ఒకసారి మల్బరీ సాగు చేస్తే 15 నుంచి 20 ఏళ్ల వరకు సాగులో ఉంటుంది. ఏడాదికి 5 పంటలను పండించవచ్చు. పట్టును దిగుబడి చేసుకున్న రైతులు మార్కెటింగ్ చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. రైతులు తమ పండించిన పంటను మదనపల్లె, ధర్మవరం, కదిరి, అనంతపురం, హిందూపురం ప్రాంతాలలో విక్రయించవచ్చు. ప్రస్తుతం కిలో పట్టు రూ.600ల నుంచి రూ.700ల వరకు పలుకుతున్నట్లు పట్టుపరిశ్రమ శాఖ అధికారులు చెబుతున్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు



పట్టు సాగులో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు. సిరికల్చర్ అధికారులు చెప్పే సూచనలు, సలహాలు పాటించడంవల్ల అధిక లాభాలు పొందవచ్చు. ఒక్కో మొక్క రూ.2 పెట్టి కొనుగోలు చేశాం. ఎకరాకు 4200 మొక్కలు నాటాను. అధికారులు చెప్పిన విధంగా పేడ ఎరువులు వాడటంవల్ల మంచి దిగుబడి వచ్చింది.

– రాంగోపాల్‌రెడ్డి, మల్బరీ సాగు రైతు, బలపనూరు

పశువుల పేడతో మంచి దిగుబడులు



పట్టు సాగు చేసే రైతులు తమ పొలంలో పశువుల పేడతో మల్బరీ సాగు చేయడంవల్ల పంట మంచి నాణ్యతగా ఉంటుంది. అలాగే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రభుత్వం కూడా మల్బరీ సాగు చేసే రైతులకు సబ్సిడీతో అన్ని సదుపాయాలు కల్పిస్తోంది. రైతులు ఎక్కువ మంది మల్బరీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

– శ్రీనివాసులరెడ్డి, పట్టుపరిశ్రమ శాఖ అధికారి, కడప జిల్లా

సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయండి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : అందరూ సమన్వయంతో పనిచేసి జగనన్న సంపూర్ణ భూహక్కు, భూరక్ష పథకాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, వెల్ఫేర్ సెక్రటరీలతో జగనన్న సంపూర్ణ భూహక్కు, భూరక్ష పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆస్తి పన్ను వసూళ్లు సచివాలయ పరంగా వందశాతం వసూలుకు శ్రమించాలన్నారు. అలాగే జగనన్న కాలనీలో కడుతున్న ఇళ్లకు లబ్ధిదారులు కట్టాల్సిన మొత్తాలను సచివాలయ వలంటీర్ ద్వారా గుర్తించి వారితో త్వరగా కట్టించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘునాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట

వేంపల్లె : స్థానిక కడప–పులివెందుల బైపాస్ రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం ఉదయం గణపతి పూజ, స్వామివారి గ్రామోత్సవం ఉంటాయన్నారు. రెండు రోజుల పాటు వివిధ పూజాది కార్యక్రమాలు నిర్వహించి 12వ తేదీన అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట ఉంటుందన్నారు. మండల ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ


కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

పెండ్లిమర్రి : మండలంలోని ఇసుకపల్లె, జీసీపల్లె హైస్కూల్‌లు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను గురువారం డీఈఓ సీ దేవరాజు తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న రాగి జావాకు సంబంధించిన ప్యాకెట్లను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుజాత, హెచ్‌ఎంలు, ఎస్‌ఓ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల పుట్టబోయో బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ తెలిపారు. గురువారం పట్టణ పరిధిలోని కన్నెలూర్ గ్రామంలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో ప్రధానమంత్రి సురక్షిత అభియాన్‌లో భాగంగా 20 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతినెల ఆసుపత్రికి వెళ్లి డాక్టర్ల సూచన మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎక్కువగా ఆకు కూరలు గుడ్డు, పాలు, మాంసంకృతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంగళరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన


పోలింగ్ స్టేషన్‌లను పరిశీలిస్తున్న కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను గురువారం మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ పరిశీలించారు. ఈనెల 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్‌లలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై ఆయన సంబంధిత అధికారులతో చర్చించారు. ఓటర్లకు ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని సదుపాయలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సందీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, సెక్రటరీలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

వల్లూరు : మండలంలోని పలు గ్రామాలలో వున్న దేవాదాయ శాఖ భూముల గురించి దేవాదాయ ధర్మాదాయ శాఖ వల్లూరు మండల ఇన్‌చార్జి, కడప సమూహ దేవస్థానముల కార్యనిర్వహణాధికారి ఏ శ్రీనివాసులు తహసీల్దార్ అమరేశ్వరికి గురువారం వినతిపత్రాన్ని అందచేశారు. మండలంలోని గోటూరు, అంబవరం, పెద్దపుత్త, కోదండరామాపురం, కోట్లూరు, కుమారునిపల్లె, లేబాక, తప్పెట్ల, పైడికాలువ, వల్లూరు తదితర గ్రామాల పరిధిలో వున్న దేవాదాయ శాఖకు సంబంధించిన భూముల వివరాలను ఆయన తహసీల్దార్‌కు అందజేశారు. ఈ భూములకు సంబంధించి జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం కింద రీ సర్వే చేయాలని, సర్వే చేసే సమయంలో తమ శాఖకు సమాచార ఇస్తే తాము హాజరవుతామని ఆయన తహసీల్దార్‌కు తెలిపారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి


వేంపల్లె : ఓటు అభ్యర్థిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తదితరులు


చింతలజూటూరులో ఓటు అభ్యర్థిస్తున్న మండల ఇన్‌చార్జి, జెడ్పీటీసీ, తదితరులు

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి గురువారం మండలంలోని టి.వెలమవారిపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లతీఫా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు రుద్ర భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు శివశంకర్‌రెడ్డి, కటిక చంద్రశేఖర్, నాయకులు దస్తగిరి, రవిశంకర్‌రెడ్డి, బాబురెడ్డి, గంగన్న, ఆర్.చంద్రఓబుళరెడ్డి, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొండూరు : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శాప్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పాలూరు వేణుగోపాల్‌రెడ్డిలు గురువారం మండలంలోని పాలూరు, యాదవారిపల్లె, గోటూరు, చెన్నంపల్లె, తిమ్మాపురంపేట తదితర గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శివశంకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి షఫి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మైసూరారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శంకర్, సింగిల్ విండో ప్రెసిడెంట్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వేముల : ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డిలు గురువారం మండలంలోని చింతలజూటూరు గ్రామంలో ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, శ్రీనివాసరెడ్డి, చలమారెడ్డి, రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : పట్టభద్రుల మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, పౌరసరఫరాల డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి గురువారం మండలంలోని ఎస్.పాలగిరి, గంగిరెడ్డిపల్లె, కొమ్మద్ది, అడవిచెర్లోపల్లె, వీరపునాయునిపల్లె, అనిమెల తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, మణి, శంబురెడ్డి, సాంబశివారెడ్డి, పాయసంపల్లె ఎంపీటీసీ రామాంజనేయరెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య మండలంలోని వెల్లటూరు గ్రామంలో గురువారం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, హుస్సేన్, సుదర్శన్ రెడ్డిలు పాల్గొన్నారు.

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మండలంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని మండల నాయకులు గురువారం చిన్నకొమెర్ల, కర్మలవారిపల్లె, నార్జంపల్లె తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఎంపీటీసీ లక్ష్మిదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, శివ గుర్విరెడ్డి, రామాంజనేయయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, కిరణ్, వెంకటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు

మండలం పేరు	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
కమలాపురం	1531	59
వల్లూరు	751	21
చెన్నూరు	1101	67
సీకే దిన్నె	1798	121
పెండ్లిమర్రి	1168	28
వీఎన్ పల్లె	877	45
మొత్తం	7226	341

కమలాపురం : ఈనెల 13వ తేదీన జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఓటర్లందరికి రెవెన్యూ అధికారులు ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారు. ఓటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని వసతులు పూర్తి చేసినట్లు మండల తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు.

వైఎస్సార్ సీపీ తరఫున పట్టభద్రుల అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థిగా రామచంద్రారెడ్డి పోటీలో నిలవగా టీడీపీ తరఫున గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి బరిలో నిలిచారు.

అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం



కమలాపురం మండలంలో పట్టభద్రులకు రెండు పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు ఒక కేంద్రం ఏర్పాటు చేశాం. ఈ మూడు కేంద్రాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేశాం. 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తాం. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– నారాయణరెడ్డి, మండల తహసీల్దార్, కమలాపురం.

ఇంటి ముందర ఇంకుడు గుంతను తవ్వించుకోవాలి


విద్యార్థులతో నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ మణికంఠ, తదితరులు

వేంపల్లె : ప్రతి విద్యార్థి ఇంటి ముందర ఇంకుడు గుంతను తవ్వించుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ మణికంఠ తెలిపారు. స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం సహకారంతో వర్షపు నీటిని ఒడిసి పట్టుట అనే అంశంపై గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నీటిని ఒడిసి పట్టుట వలన కలిగే ప్రయోజనాలు, వాటి పద్ధతుల గురించి వివరించారు. అనంతరం డాక్టర్ ఓబుళరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ ఇంటి సమీపంలో ఇంకుడు గుంతలను తవ్వించుకుని మన వంతు బాధ్యతగా నీటిని సంరక్షించాలన్నారు. అనంతరం ఉపన్యాస పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, డాక్టర్ మల్లేశ్వరమ్మ, కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘన, జీవామృతాల తయారీపై దృష్టి సారించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

లింగాల : ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులు ఘన, జీవామృతాల తయారీపై దృష్టి సారించాలని అడిషనల్ డీపీఎం వసంతకుమారి తెలిపారు. గురువారం లింగాలలో గ్రామ రైతులకు నవధాన్యాల సాగుపై నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రసాయనిక ఎరువులకు బదులు నవధాన్యాలు వేసుకోవాలన్నారు. నవధ్యానాలను సాగు చేసుకోవడంవల్ల భూమికి మంచి శక్తిని అందిస్తాయన్నారు. సాగు చేసుకున్న రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోందన్నారు. అలాగే ఎన్ని రకాల విత్తనాలు వేసుకోవాలి, ఏఏ రకాల విత్తనాలు కావాలనే విషయాన్ని ఆమె వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, వ్యవసాయాధికారి రమేష్ నాయక్, ఏపీఎం ఆంజనేయులు, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, సీసీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ విజయలక్ష్మి

వల్లూరు : బాలికలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తగిన జాగ్రత్తలను పాటించాల్సిన అవసరం వుందని కమలాపురం ఎస్‌బీఐ మేనేజర్ విజయలక్ష్మి తెలిపారు. వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యాలయంలో చదువుతున్న 120 మంది బాలికలకు సీఎస్ఆర్ యాక్టివిటీ కింద ఎస్‌బీఐ బ్రాంచ్ ద్వారా రీ యూజబుల్ హై క్వాలిటీ శానిటరీ న్యాప్‌కిన్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరి రక్షించుకోవచ్చునన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎంఈఓ లిల్లెమ్మ మాట్లాడుతూ బాలికలు ఆరోగ్య విద్యపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని, యుక్త వయసులో సరైన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నసీమున్నీసా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన డిగ్రీ విద్యార్థులు


విజేతలను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్‌రెడ్డి

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు విశ్వ విద్యాలయ అంతర్గత క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈనెల 8వ తేదీన యూనివర్శిటీలో జరిగిన ఈ పోటీల్లో కళాశాలకు చెందిన విద్యార్థులు పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో డి. సుధా గౌరి (సెకండ్ బీ.కాం.), ఏ. శివ ప్రత్యూష (థర్డ్ బీ.కాం.), పి. ప్రభుదేవ (సెకండ్ బీ.కాం.), ఎ. సుధీర్ కుమార్ (థర్డ్ బీ.ఎ.) నాయబ్ రసూల్ (సెకండ్ బీ.ఎస్సీ.), రవి శంకర్‌లు వివిధ స్థానాల్లో ప్రతిభ కనబరిచారు. అలాగే రైఫిల్ షూటింగ్‌లో ఎం.నాగరాజు ద్వితీయ స్థానంలో నిలిచాడు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్‌రెడ్డి అభినందించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పల్లాకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ బి.నరహరి, జిమ్ మాస్టర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి


మాట్లాడుతున్న కడప మేయర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు

ఎర్రగుంట్ల : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్జీతో గెలిపించాలని కడప మేయర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు కోరారు. గురువారం ఆయన ఎర్రగుంట్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల పార్టీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డితో కలసి ఎన్నికల పోలింగ్ సరళిపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉద్యానశాఖ సలహాదారులు ప్రసాద్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్ ఎరికలరెడ్డి ఇతరులు పాల్గొన్నారు.

మొల్ల రామాయణం నవరస భరితం

కడప కల్చరల్ : మహా కవయిత్రి గోపవరం మొల్లమాంబ రచించిన రామాయణం నవరస భరితమైనదని మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. మొల్ల సాహితీజయంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జరిగిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. హనుమంతుడు సముద్రాన్ని దాటడంలో వీరరసం, లంకా దహనంలో బీభత్సం, వానరుల మధువన చేష్టలలో హాస్యం, వీభీషణుని శరణాగతిలో భక్తి, సీతా వియోగంలో కరుణ, రామరావణ యుద్ధంలో రౌద్రం తదితర నవరసాలు మొల్లమ్మ రామాయణంలో పలుచోట్ల దర్శనమిస్తాయన్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, సాహితీ పీఠం ఉపాధ్యక్షులు పెండ్లిమర్రి మల్లయ్య, మరికొందరు సభ్యులు కూడా ప్రసంగించారు. తొలుత మొల్లమాంబ చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి నివాళులర్పించారు.విశ్రాంత ఉద్యోగులు సుబ్బరాయుడు, నరేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణతో పుష్పగిరిలో సందడి

కడప కల్చరల్ : గిరి ప్రదక్షిణ కారణంగా ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పుష్పగిరిలో సందడి పెరిగిందని పుష్పగిరి ధర్మ పరిరక్షణ సేన ప్రతినిధి, భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ జీవితకాల సభ్యులు సట్టి భారవి పేర్కొన్నారు. గురువారం ఆయన ఎర్రముక్కపల్లెలోని తన కార్యాలయంలో సంస్థ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పుష్పగిరిలో మార్చి 1న నిర్వహించిన గిరి ప్రదక్షిణ విజయవంతం కావడం జిల్లా ధార్మిక వేత్తలకు సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఇకపై ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతి విడత తాము జిల్లా ధార్మిక సంస్థల పరిరక్షణ సమితితో కలిసి పీఠాధిపతి సహకారంతో ప్రదక్షిణకు వచ్చే భక్తులకు అల్పాహారం, మంచినీటి సౌకర్యం కల్పించనున్నామన్నారు.